# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ నీట్ (NEET) పేపర్ లీకేజీ వ్యవహారం, విద్యార్థుల నిరసనలతో సహా పలు అంశాలపై ప్రతిపక్షాల నిరసనల నడుమ పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

❖ స్వేచ్ఛాయుతమైన, సమాన అవకాశాలు కలిగిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం భారతదేశం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.

❖ యువత భావోద్వేగాలు, ఆందోళనల పట్ల కేంద్రప్రభుత్వం ఎంతో సున్నితంగా వ్యవహరిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

========================

నీట్ (NEET) ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలు సహా పలు అంశాలపై ప్రతిపక్షాల నిరసనల నడుమ పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైనప్పుడు ప్రతిపక్ష సభ్యులు పేపర్ లీక్, విద్యార్థుల నిరసన అంశాలను లేవనెత్తారు. సభ నిర్వహణకు సహకరించాలని ప్రతిపక్షాలను స్పీకర్ ఓం బిర్లా కోరినప్పటికీ... వారు నిరసన కొనసాగించడంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాలు నిరసన కొనసాగించాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ విద్యార్థుల నిరసన అంశాన్ని లేవనెత్తారు. నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభలో ఏ చర్చ అయినా నిబంధనలకు లోబడి జరగాలని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అయినప్పటికీ గందరగోళం కొనసాగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే, నీట్ అంశంపై ప్రతిపక్షాలు మళ్లీ నినాదాలు చేయడం ప్రారంభించాయి. దీంతో ప్రిసైడింగ్ అధికారి సభను

రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 3 గంటలకు మూడోసారి వాయిదా తర్వాత సభ సమావేశమైనప్పుడు.. నీట్ తదితర అంశాలపై ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సభ నిర్వహణకు ప్రతిపక్షాలు సహకరించాలని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ కోరారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను రేపటికి వాయిదా వేశారు.

=========================

యువత భావోద్వేగాలు, ఆందోళనల పట్ల కేంద్ర ప్రభుత్వం ఎంతో సున్నితంగా వ్యవహరిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. న్యూ ఢిల్లీలో కేంద్రమంత్రి ఈరోజు మాట్లాడుతూ... ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులు, యువతను రాజకీయ ఆయుధంగా వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడానికి, యువత సంక్షేమాన్ని కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. పార్లమెంట్ లో ప్రతి అంశంపై అర్థవంతమైన చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

=========================

రాజ్యసభలో ఈరోజు ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే.. సిక్కింలోని ఎన్‌హెచ్‌పిసి (NHPC) తీస్తా స్టేజ్ VI హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సంతాపం తెలిపారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా రాజ్యసభ కొద్దిసేపు మౌనం పాటించింది. భారతదేశపు మొదటి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన `హైడ్రోజన్ ఆధారిత రైలు` ప్రారంభమైనందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను రాధాకృష్ణన్ అభినందించారు. దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు కార్యకలాపాలు ప్రారంభం కావడం ద్వారా భారత్ ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించిందన్నారు. హర్యానాలోని ఉత్తర రైల్వేకి చెందిన జింద్-సోనిపట్ సెక్షన్‌లో 10 కోచ్‌ల రైలు సర్వీసులు ప్రారంభమయ్యాయని, ఇది పర్యావరణహిత, సాంకేతికంగా పురోగమించిన రైలు రవాణా వైపు ఒక ప్రధాన అడుగు అని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

=========================

ఉత్తర మాసిడోనియా దేశ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు `మ్యూజియం ఆఫ్ ది సిటీ ఆఫ్ స్కోప్జె`లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ భారతదేశానికి చెందినప్పటికీ, ఆయన బోధించిన సత్యం, అహింసా సందేశం సమస్త మానవాళికీ చెందుతుందన్నారు. ఘర్షణలు, అసహనం, విభజనలతో కూడిన నేటి ప్రపంచంలో గాంధీజీ ప్రతిపాదించిన చర్చలు, కరుణ, శాంతియుత సహజీవనం వంటి ఆదర్శాలు ఎంతో అనుసరణీయమైనవని రాష్ట్రపతి పేర్కొన్నారు.

విరామం

=========================

అస్థిరత, ఆటంకాలు నెలకొన్న ఈ యుగంలో అత్యంత స్పష్టమైన ఒత్తిడి... సరఫరా వ్యవస్థలపైనే కనిపిస్తోందని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఈరోజు జరిగిన `ఆసియాన్ పోస్ట్-మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ విత్ ఇండియా-2026` సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఇంధనం, ఆహారం, ఆరోగ్య భద్రతలను ఇకపై తేలికగా తీసుకోలేమని చెప్పారు. భారతదేశం, ఆసియాన్ (ASEAN) రెండూ తమ భవిష్యత్ అవకాశాలపై ఆశాజనకంగా ఉన్నాయని, సవాళ్లను ఎదుర్కొంటూనే అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సంవత్సరం `ఆసియాన్-ఇండియా సముద్ర సహకార సంవత్సరం` (ASEAN-India Year of Maritime Cooperation) అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఇక రెండు రోజుల ఫిలిప్పీన్స్‌లోని మనీలా నగరంలో ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా విదేశాంగ మంత్రులతో కలిసి `క్వాడ్ (Quad) విదేశాంగ మంత్రుల సమావేశం`లో ఈరోజు పాల్గొన్నారు. ఇండో-పసిఫిక్

ప్రాంతంలో పరిస్థితులను సమీక్షించడంతో పాటు ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై చర్చించినట్లు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఆసియాన్ (ASEAN) కేంద్ర స్థానాన్ని గుర్తిస్తూనే.. స్వేచ్ఛాయుతమైన, సమాన అవకాశాలు కలిగిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం భారత్ కట్టుబడి ఉందనే విషయాన్ని పునరుద్ఘాటించారు. ఈ సమావేశం అనంతరం జైశంకర్.. అమెరికా విదేశాంగ కార్యదర్శి (సెక్రటరీ) మార్కో రూబియోతో భేటీ అయ్యారు.

========================

భారత నౌకాదళం మాహే శ్రేణికి చెందిన రెండవ `యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్` అయిన INS మాల్వాన్ ను ఈరోజు కర్ణాటకలోని కార్వార్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్- ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... `ఆత్మనిర్భరత` దిశగా నౌకాదళం చేస్తున్న కృషిని అభినందించారు. దేశ తీర ప్రాంతాల సముద్ర భద్రతలో INS మాల్వాన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ మిషన్‌లో భాగంగా కొచ్చిన్ షిప్‌యార్డ్ నిర్మించిన ఈ INS మాల్వాన్ యాంటీ-సబ్‌మెరైన్ వాటర్ క్రాఫ్ట్‌లో 80 శాతానికి పైగా స్వదేశీ పరికరాలు, సాంకేతికతను ఉపయోగించారు. ఈ నౌక.. భారత సముద్రగర్భ రక్షణలో కీలక పాత్ర పోషించగలదు. యుద్ధనౌకల నిర్మాణంలో దేశానికి పెరుగుతున్న సామర్థ్యానికి, అలాగే సముద్ర భద్రత, యాంటీ-సబ్‌మెరైన్ పోరాటంలో పెరుగుతున్న భారత రక్షణ రంగ బలానికి ఈ యుద్ధనౌక నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

గుజరాత్, మధ్య మహారాష్ట్రలలో ఈరోజు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) రెండ్ అలర్ట్  జారీ చేసింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో తూర్పు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, కొంకణ్, గోవా, మధ్యప్రదేశ్, పంజాబ్‌లలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మరోవైపు ఢిల్లీ, హర్యానా, ఛండీఘర్, ఉత్తరాఖండ్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, గంగా పరివాహక పశ్చిమ బెంగాల్, విదర్భ, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లలో ఈరోజు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 470 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 715 పాయింట్ల నష్టంతో 76 వేల 755 వద్ద ముగిసింది. నిఫ్టీ 191 పాయింట్లు నష్టపోయి 23 వేల 996 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96 రూపాయల 57 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 117 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

========================

భద్రతా కారణాల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు జాతీయ రాజధానిలో 16 మెట్రో స్టేషన్లను మూసివేసినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (DMRC) ఈరోజు వెల్లడించింది. మూసివేసిన స్టేషన్లలో లోక్ కళ్యాణ్ మార్గ్, రాజీవ్ చౌక్,

పటేల్ చౌక్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, బారాఖంభా రోడ్, సుప్రీం కోర్ట్, సేవా తీర్థ, జన్‌పథ్, మండి హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, ఐటీఓ, ఢిల్లీ గేట్, ఇంద్రప్రస్థ, ఖాన్ మార్కెట్, జోర్ బాగ్, శివాజీ స్టేడియంలు ఉన్నాయి.

=========================

=========================